క్లుప్తంగా

నేడు గడప గడపకు..


ప్రారంభానికి సిద్ధంగా గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రం

గంగాధరనెల్లూరు: మండలంలోని అంబోదరపల్లి గ్రామసచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి, రైతుభరోసా అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు అంబోదరపల్లి బాబురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుంటారని వివరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం ..
అంబోదరపల్లి గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని మొరవ గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం సకల దేవతలను ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవాలు 10 రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథ, రాత్రి వీధి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో తరలించాలని కోరారు.

కుక్కలదాడిలో దుప్పి మృతి

కార్వేటినగరం: కుక్కల దాడిలో దుప్పి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కేశవకుప్పం ఎస్టీకాలనీలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా.. అటవీ ప్రాంతం నుంచి తాగు నీటి కోసం దుప్పి కేశవకుప్పం ఎస్టీ కాలనీ వైపు రావడంతో గ్రామంలోని కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో దుప్పి మృతి చెందిందని తెలిపారు. మృతి చెందిన దుప్పిని కార్వేటినగరం సమీపంలోని కుప్పానిగుంట నర్సరీ వద్ద పశువైద్యాధికారి డాక్టర్ హేమాద్రి పంచనామా నిర్వహించి అనంతరం ఖననం చేశారు. గతవారం క్రితం కూడా కేశవకుప్పం అటవీప్రాంతంలో కుక్కల దాడికి దుప్పి మృతి చెందిందన్నారు. వారి వెంట అటవీశాఖ సిబ్బంది పలువురు ఉన్నారు.

ఆధునిక పరిశోధనలు అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ రవిచంద్రారెడ్డి

పుత్తూరు రూరల్: హోమియోపతి వైద్యంలో ఆధునిక పరిశోధనలు అవసరమని తిరుపతి క్లినికల్ రీసర్చ్ యూనిట్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రవించద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కేకేసీ హోమియోపతి కళాశాలలో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి కేంద్రంలో ఆధునిక పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. సీసీఆర్‌హెచ్‌లో స్టూడెంట్లు క్లీనికల్ పోస్టింగ్‌కు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్ చైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శరవణన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


వార్డు కౌన్సిలర్లతో చర్చిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలు గుర్తించి పరిష్కరించాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి సూచించారు. గురువారం ఆయన 16, 17 వార్డుల్లో కౌన్సిలర్లతో కలిసి పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సిందిగా కౌన్సిలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, వార్డు కౌన్సిలర్లు వనిత, భువనేశ్వరి, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంక్‌కు మహర్దశ

పుత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కట్ట మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మంత్రి ఆర్‌కే రోజా రెండేళ్ల కృషి ఫలితంగా రూ.9 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. మరో పక్క ఏఐబీ నిధులు రూ.138 కోట్లతో శ్రీకాళహస్తి లక్ష్మీపురం నుంచి పుత్తూరు ఎస్‌ఎస్ ట్యాంకుకు పైపులైను పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తయితే తెలుగుగంగ నీరు పుత్తూరు ట్యాంకుకు చేరుతుంది. ట్రీట్‌మెంట్ ప్లాంటు ద్వారా నీటిని శుద్ధి చేసి తాగునీరు సరఫరా చేస్తే పుత్తూరు పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు అవుతుంది.

- పుత్తూరు ఎస్‌ఎస్ ట్యాంకు మరమ్మతులకు రూ.9 కోట్లు నిధుల మంజూరు
- త్వరలో టెండర్లు పిలిచే అవకాశం
- ఫలించిన మంత్రి రోజా కృషి
- 2006లో నాసిరకంగా ట్యాంకు నిర్మాణం
- రూ.కోట్లు కాజేసిన గాలి భాను అండ్ కో


పుత్తూరు ఎస్‌ఎస్ ట్యాంకు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణానికే తలమానికమైన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు మహర్దశ పట్టనుంది. నాడు 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పుత్తూరు ప్రజల దాహార్తిని తీర్చడానికి పుత్తూరు చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.55 కోట్లు మంజూరు చేశారు. ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణ పనులను అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న గాలి ముద్దుకృష్ణమనాయుడు తన కుమారుడు గాలి భానుప్రకాష్‌కే కట్టబెట్టారు. జయ్‌గణేష్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన గురు అనే బినామీ వ్యక్తి పేరు మీద పనులు చేపట్టారు. నాలుగేళ్ల పాటు చేపట్టిన ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనుల్లో ఏమాత్రం నాణ్యత లేకపోవడంతో పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. అయితే వీటిని ఏమాత్రం పట్టించుకోని ముద్దుకృష్ణమనాయుడు తనదైన శైలిలో 2010 నాటికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పని పూర్తయినట్లు చెప్పారు. అయితే 2009 ఎన్నికల సమయానికే తెలుగుదేశం పార్టీలోకి చేరిన ముద్దుకృష్ణమనాయుడు నగరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందినా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే రావడంతో ట్యాంకును అధికారికంగా ప్రారంభించకుండానే స్థానిక మున్సిపాలిటీ అధికారులకు అప్పజెప్పారు.

అవినీతి ఆరోపణలకు నిదర్శనం ఇదిగో..
నాటి అవినీతి ఆరోపణలకు నిదర్శనంగా ట్యాంకు నిర్మాణం జరిగిన 10 ఏళ్లకే కట్ట కుంగిపోయింది. 2021 మే 18న 10 అడుగుల లోతుతో 200 మీటర్ల పొడవునా కట్ట కుచించుకుపోయింది. ట్యాంకు వాటర్ కెపాసిటీ 2400 ఎంఎల్‌డీలు కాగా, ఆనాటికి ఉన్నది 1440 ఎంఎల్‌డీల నీరు. ఇంత నీరు నిల్వ ఉన్న సమయంలో గండి పడితే పుత్తూరు పట్టణం సగ భాగానికి పైగా కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో అనారోగ్యంతో చెన్నైలోని ఆస్పత్రిలో ఉన్న ఎమ్మెల్యేగా ఉన్న ఆర్‌కే రోజా అప్పటికప్పుడు జిల్లా అధికారులను అప్రమత్తం చేసి మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్‌తో యుద్ధ ప్రాదిపతికన మరమ్మతులు చేయించారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. 2021 జూన్ 25న ట్యాంకు కట్ట శాశ్వత పరిష్కారం చూపాలని, ట్యాంకు నిర్మాణంలో జరిగిన అవినీతిని సైతం వెలికి తీయాలంటూ ఎమ్మెల్యే రోజా స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి లేఖ రాశారు. స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రెటరీ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులైన పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ చంద్రయ్య, జీఎస్‌ఎస్‌ఎస్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సుధారాణి బృందం ట్యాంకు కట్టను పరిశీలించి, మట్టి నమూనాలను సేకరించింది. అన్ని విషయాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. నేటికి శాశ్వత మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

నాడు వైఎస్సార్.. నేడు వైఎస్ జగన్..
2004లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పుత్తూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమ్మర్ స్టోరేజీ నిర్మాణానికి రూ.55 కోట్లు నిధులు విడుదల చేశారు. దీనికి కొనసాగింపుగా శ్రీకాళహస్తి నుంచి పుత్తూరు ఎస్‌ఎస్ ట్యాంకుకు పైపులైన్ల ద్వారా తెలుగుగంగ నీటిని తేవడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.139 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులు మంజూరు కావడానికి మంత్రి ఆర్‌కే రోజా కృషి, పట్టుదలే కారణం.


నాసిరకంగా నిర్మించిన ట్యాంకు కట్ట లోపలి భాగం


కుంగిన కట్ట (ఫైల్)


కట్ట కుంగిన చోట తాత్కాలికంగా చేపట్టిన మరమ్మతులు

వైభవంగా కుంభాభిషేక పూజలు


హోమపూజలు నిర్వహిస్తున్న విజయేంద్ర సరస్వతి


విజయేంద్ర సరస్వతికి ఆహ్వానం పలుకుతున్న భక్తులు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో బుగ్గ కాశీవిశ్వేశ్వరాలయ సమీపం ఉన్న బుగ్గ శంకర మఠంలో శ్రీ ఆదిశంకర శ్రీ శంకర వినాయక ఆలయ కుంభాభిషేక వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించిన ఈ కుంభాభిషేక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి భక్తులతో మాట్లాడుతూ 1932లో బుగ్గలో శంకరాచార్యుల వారు చాతుర్మాస్యను ఆచరించారన్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో శ్రీ శంకరమతం స్థాపించబడిందన్నారు. 2006లో కుంభాభిషేకం నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం ఆది శంకర, శ్రీ శంకర వినాయక దేవాలయాల జీర్ణోద్ధారణ అష్టబంధన మహాకుంభాభిషేక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వినాయక పూజ, గృహప్రీతి, పుణ్యాహవచనం, మృత్యుంజయ హోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం కలశ పూజ నిర్వహించి విమాన మహా కుంభాభిషేకం నిర్వహించారు. కుంభాభిషేక జలం కోసం భక్తులు పోటీపడ్డారు. అనంతరం విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి శంకరమతం సమీపంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

బీజేపీ నేతల ధర్నా హాస్యాస్పదం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నింద్ర: నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద బీజేపీ నాయకులు ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులు బీజేపీ, టీడీపీ నాయకుల జిమ్మిక్కులను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. మా నాయకురాలు మంత్రి రోజా రైతుల సమస్య పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. గత నెల రోజుల కిందట అసెంబ్లీలో షుగర్ ఫ్యాక్టరీ రైతుల, కార్మికుల సమస్యలను ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొంత మంది రైతులు కోర్టుకు వెళ్లడంతో సమస్య పరిష్కారం కావడానికి ఆలస్యం అవుతోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నది మీ ప్రభుత్వమేనని, మరి ఇంత కాలం ఈ బీజేపీ నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మంత్రి రోజా ఇదే అంశంపై జిల్లా కలెక్టర్, కేన్ కమిషనర్ జాన్‌విక్టర్‌తో ఎన్నోసార్లు మాట్లాడి ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేసి రైతులను ఆదుకోవాలని కోరితే. దానికి కూడా రైతుసంఘం నాయకులు అడ్డుపడ్డారని గుర్తు చేశారు. రైతుల సమస్యలపై మాట్లాడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి రోజాను విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో శ్యామ్‌లాల్, సర్పంచ్ బాబురెడ్డి, వైస్ ఎంపీపీ శుభ, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, వెంకటేష్, మురళి, శివలింగా ఆచారి, చార్లీ పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే నవభారత నిర్మాతలు


పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

నగరి: నేటి విద్యార్థులే రేపటి నవభారత నిర్మాతలని హెచ్‌ఎం కలికిరి పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని మునెప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ, పాఠశాల వార్షికోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనపై ఆసక్తి కలిగి అవగాహనతో విద్యాభ్యాసం చేసి ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడా నైపుణ్యాలు, సృజనాత్మక నైపుణ్యాలు కూడా కలిగి ఉన్నప్పుడే వారి గమ్యాన్ని సులభంగా చేరుకోగలరని ఉద్బోధించారు. వినయంతో కూడిన విద్య మనిషికి అపారమైన విలువను సంపాదించి పెడుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. కార్యక్రమంలో టీచర్ ద్రాక్షాయణి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భువనేశ్వరి, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు రోశి, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని బలిజమొండివెంగనపల్లె ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని స్కూల్ ఉపాధ్యాయుల గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం శంకర్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రమ శిక్షణే ప్రధాన ఆయుధమని, పోటీ ప్రపంచంలో చదువే గొప్పవరమన్నారు.

నేడు జాబ్‌మేళా

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7780323736 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

చిరంజీవులుకు నివాళి


నివాళులు అర్పిస్తున్న శివప్రకాష్ రాజు

పాలసముద్రం : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిరంజీవులు నాయుడు మృతి బాధాకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజు అన్నారు. గురువారం ఆయన వనదుర్గాపురం గ్రామానికి చేరుకుని చిరంజీవులు మృతదేహానికి నివాళులు అర్పించారు.

స్మార్ట్ డీవీ పరిశ్రమ సందర్శన


స్మార్ట్ డీవీ పరిశ్రమను డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలసి పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

శ్రీరంగరాజపురం : దేశంలోనే గ్రామీణ ప్రాంతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరిస్తున్నా అతి పెద్దస్మార్ట్ డీవీ పరిశ్రమ నిర్మాణ పనులను గురువారం డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలసి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ విజయానందరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ 6000 వేలమంది నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా స్మార్ట్‌డీవీ పరిశ్రమ చైర్మన్ దీపక్ తాల నిర్మిస్తున్నారని, ఈ పరిశ్రమను ఆగస్టులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ఈ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేపీ శ్రీధర్, రమణప్రసాద్ రెడ్డి, సర్పంచ్ డిల్లయ్య, విజయాబాబు, జనార్దన్, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సామాజిక తనిఖీపై శిక్షణ


ప్రసంగిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం : మండల పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీ కార్యక్రమంపై గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో శిక్షణ నిర్వహించామని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సపోర్టింగ్ ఆఫ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సాల్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆర్థిక సహాయంతో చేపడుతున్న నాడు–నేడు స్కూల్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో సామాజిక తనిఖీ తల్లిదండ్రుల ద్వారా నిర్వహించాల్సిన ముఖ్యమైన అంశంపై స్కూళ్ల హెచ్‌ఎంలకు శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్షమంలో సామాజిక తనిఖీ ప్రశ్నపత్రంలో మొత్తం ఆరు ప్రధాన అంశాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయుల ప్రగతి, విద్యార్థుల ప్రగతి సౌకర్యాలు, విద్యార్థులు సెక్యూరిటీ, కమ్యూనిటీ మొబిలైజేషన్, కమ్యూనిటీ భాగస్వామం అంశాలు, 42 ఉప అంశాల గురించి నాలుగు లెవల్స్ గురించి ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. 107 ప్రశ్నలను ఎలా పూర్తిచేయాలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు వివరించారు. సామాజిక రిపోర్టులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సెల్వం, వెంకటేష్, హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు చేశాం


జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి : నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముడిపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గృహాలకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలనలో ప్రజలకు మేలు చేయలేదు గనుకే ఆ పార్టీ నాయకులు ప్రజల వద్ద వెళ్లే ధైర్యం చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ కృష్ణయ్య, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ


దుర్యోధనుడితో తలపడుతున్న భీముడు


దుర్యోధన వధను తిలకిస్తున్న జనసందోహం

పాలసముద్రం : మండలంలోని ఆముదాల గ్రామంలో వెలసిన ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన గధాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. వేణుగోపాల నాట్యబృదంలో భీమసేనుడిగా గోవిందరాజు, దుర్యోధనుడుగా భాస్కర్‌రెడ్డి వేషధారణలతో అలరించారు. కురుక్షేత్ర యుద్ధం ముగింపుతో సర్వం కోల్పోయిన దుర్యోధనుడు అస్త్రసన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్లగా, భీముడు రెచ్చగొట్టి యుద్ధానికి ప్రేరేపించే సన్నివేశం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది. దుర్యోధన వధ సన్నివేశాన్ని కళాకారులు రక్తి కట్టించారు. ఈ సన్నివేశాలను తిలకించడానికి మండల ప్రజలతో పాటు తమిళనాడు వాసులు కూడా తరలివచ్చారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల హవా

పుత్తూరు రూరల్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించారు. సెకండ్ ఇయర్ విద్యార్థునులు మొత్తం 200 మంది పరీక్షలు రాయగా, 71.5 శాతంతో 143 మంది ఉత్తీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రఘుపతి గురువారం తెలిపారు. సీఈసీలో ఎం.కన్నెమ్మ 985/1000 మార్కులు సాధించగా, బైపీసీలో ఎం.దివ్య 950/1000 మార్కులు సాధించారని చెప్పారు. ఫస్ట్ ఇయర్ నుంచి మొత్తం 241 మంది పరీక్షలు రాయగా, 57 శాతంతో 137 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సీఈసీలో ఎం.ఉషశ్రీ 474/500 మార్కులు, సీఈసీలో ఎస్.విజిత 474/500 మార్కులు సాధించినట్లు చెప్పారు. మంచి ఫలితాలు రావడానికి కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థులను ఆయన అభినందించారు.

నగరిలో నగరి : మండలంలోని డాక్టర్ ఎంఎస్ఎంఎన్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఫస్ట్ ఇయర్‌లో 39 మంది, ద్వితీయ సంవత్సరంలో 80 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ ఎం.వెంకటరమణాచార్యులు తెలిపారు. రెండో సంవత్సరంలో ఎంపీసీలో టి.సంధ్య 963/1000, కె.రోజా 914/1000 మార్కులు, బైపీసీలో డి.జ్ఞానపూర్ణిమ 962/1000 మార్కులు, ఏఆర్ యాషిక 910/1000, జ్యోతిర్మయి 909/1000 మార్కులు, సీఈసీలో పి.గాయత్రి, స్వాతి 898/1000 మార్కులు, హెచ్‌ఈసీలో డి.కోకిల 864, జి.చంద్రిని 840 మార్కులు సాధించారు.

కళాశాల టాపర్‌గా అకీఫా



మొదటి సంవత్సరం టాపర్ అకీఫా


ద్వితీయ సంవత్సరం టాపర్ అరుణ్


ఎం.కన్నెమ్మ


ఎం.దివ్య


ఎం.ఉషశ్రీ


ఎస్.విజిత

కార్వేటినగరం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కాలేజ్ టాపర్‌గా అకీఫా నిలిచిందని రాజాకుమార రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో అకీఫా(బైపీసీ) 397/440 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. సెకండియర్‌లో సీ.అరుణ్(ఎంపీసీ) 862/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడని, వి.సుప్రియ(ఎంపీసీ) 759, మేనక(బైపీసీ)767, షరిమ్మల(బైపీసీ) 644 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు.

పాలసముంద్రంలో..
పాలసముద్రం : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ప్రతిభ చాటారని గురువారం ప్రిన్సిపల్ వినాయకం తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో 22 మంది, సెకండియర్‌లో 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అందులో పీ.అకిల ఎంపీసీ విద్యార్థిని 932/1000 మార్కులు సాధించి కాలేజీలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ తెలిపారు.


అఖిల

వెదురుకుప్పంలో 25 శాతం ఉత్తీర్ణత
వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 25 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ నిర్మల కుమారి తెలిపారు. ఇంటర్ సెకండియర్‌లో 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.

పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..
పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 45 శాతం, మొదటి సంవత్సరంలో 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో హరిహరన్ 872/1000 మార్కులు, గిరిబాబు 869/1000 మార్కులు, బైపీసీలో రాజేష్ 811/1000 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో రోహిత్ 380/470 మార్కులు, బైపీసీలో ఉమామహేశ్వరి 425/440 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ వెంకటాచలపతి తెలిపారు.


టి.సంధ్య


జ్ఞానపూర్ణిమ


హరిహరన్


రాజేష్


రోహిత్


ఉమామహేశ్వరి